సాక్షి
నంద్యాల
శనివారం, 6, ఏప్రిల్, 2024



మహానందిలో కన్నడిగుల రద్దీ

మహానంది: మహానందీశ్వరుని దర్శనార్థం కర్ణాటక భక్తులు శుక్రవారం భారీగా తరలి వచ్చారు. స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు.



నయనం.. నవతేజం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో లక్షలాది మందికి చూపును ప్రసాదించింది. పేదల కుటుంబాల్లో వెలుగులు నింపింది. IIలో▸



బోధన మెరుగుపడేలా..

సర్కారు బడుల్లో డిజిటల్ విద్యాబోధన మరింత మెరుగుపడింది. 'స్విఫ్ట్ చాట్‌బాట్' పేరుతో ఓ యాప్‌ను అనుసంధానం చేస్తూ పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంది. IIలో▸

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:43
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:46
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:40
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:41
బనగానపల్లె	సా॥ 6:37	ఉ॥ 4:41

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

తల్లిదండ్రులను గౌరవించండి. తల్లి పాదాల కింద జన్నత్ (స్వర్గం) ఉంచబడింది. ఆ స్వర్గ ద్వారాల్లో తండ్రి ప్రధాన ద్వారం. తల్లిదండ్రులను కష్టపెడితే స్వర్గంలోకి ప్రవేశించడం కష్టతరం.

– పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

నంద్యాల(న్యూటౌన్): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుకు ఈనెల 10వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు నంద్యాల పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈనెల 5వ తేదీ వరకు ఉన్న గడువును మరో ఐదు రోజులు ప్రభుత్వం పొడిగించిందన్నారు. పదవ తరగతి విద్యార్హతతో పాలిటెక్నిక్ అభ్యసించేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించడం జరుగుతుందన్నారు. శిక్షణ తీసుకొనే వారికి స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 27వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

6,400 ఎకరాల్లో డ్రైలాండ్ హార్టికల్చర్‌కు ప్రణాళిక

నంద్యాల(సెంట్రల్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,400 ఎకరాల్లో డ్రైలాండ్ హార్టికల్చర్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో... ఐదు ఎకరాల్లోపు మెట్ట భూములున్న రైతులు పథకానికి అర్హులన్నారు. మామిడి, జామ, సపోటా, అల్లనేరేడు, చీనీతో పాటు అంజూర, డ్రాగన్ ఫ్రూట్ తదితర పండ్ల మొక్కలు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎకరాలోపు భూమి ఉన్న రైతులు మునగతోపాటు అంతర పంటగా మల్లె, కనకాంబరం తదితర పూల మొక్కలు సాగు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న రైతులు మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉపాధి పనులకు వచ్చే కూలీలకు రోజువారి వేతనం రూ.300గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. గతేడాది కనీస వేతనం రూ.272గా ఉండేదని పెరిగిన వేతనాలపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

- స్కూల్ కాంప్లెక్స్‌కు చేరుకున్న ప్రశ్నాపత్రాలు

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో నేటి(శనివారం)నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు మొదలు కానున్నాయి. 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ఈ పరీక్షలు ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్నాయి. 1వ తరగతి నుంచి 5, 6 నుంచి 8వ తరగతి వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 9వ తరగతికి మాత్రం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. గతంలో ఎస్‌ఏ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు పరీక్షకు గంట ముందుగా ఆయా మండలాల విద్యావనరుల కేంద్రాల నుంచి తీసుకోవాల్సి ఉండేది. అయితే మండలాల్లో స్కూళ్లు 40 కి.మీపైగా దూరంలో ఉన్నాయని, ప్రశ్నపత్రాలు తీసుకపోవడం ఇబ్బందిగా ఉందని పాఠశాల కమిషనర్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు ఏపీటీఎఫ్ నేతలు విన్నవించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రశ్నపత్రాలను మండల విద్యా వనరుల కేంద్రం నుంచి కాకుండా ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల నుంచి తీసుకుపోయేందుకు ఆదేశాలు ఇచ్చారు.

పరీక్ష తేదీలు..

1నుంచి 5వ తరగతి వరకు.. శనివారం తెలుగు, 8న ఇంగ్లిషు, 10న టోఫెల్, 12న గణితం, 13న పర్యావరణ శాస్త్రం, 16న ఎస్‌ఏ ల్‌ఏస్ (4వ తరగతికి మాత్రమే)

6నుంచి 9వ తరగతి వరకు.. శనివారం తెలుగు, 8న హిందీ, 10న ఇంగ్లిషు, 12న టోఫెల్, 13న గణితం, 15న 6,7 తరగతులకు జనరల్ సైన్స్, 8, 9 తరగతులకు ఫిజికల్ సైన్స్, 16న బయోలాజికల్ సైన్స్, 18న సోషల్ స్టడీస్

అభివృద్ధి విరాజిల్లాగా..

- నంద్యాల జిల్లా కేంద్రంగా రెండేళ్లు పూర్తి
- పట్టణంలో అభివృద్ధి పరుగులు
- సౌకర్యవంతంగా రహదారులు, డ్రైనేజీల నిర్మాణం
- ఉద్యానవనాల ఏర్పాటుతో ఆహ్లాదకర వాతావరణం
- రూ.157.15 కోట్లతో శరగవేగంగా అమృత్ పథకం పనులు
- రూ..475 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణం
- 3,006 మంది పేదలకు ఇళ్ల పట్టాలు

ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రయత్నంతో నంద్యాల రూపురేఖలు మారిపోయాయి. అభివృద్ధి వికేంద్రీకరణ మంత్రం నందుల కోటకు వరంగా మారింది. సరిగ్గా రెండేళ్ల క్రితం జిల్లాల పునర్విభజనతో పట్టణం జిల్లా కేంద్రంగా మారి ప్రగతి పథంలో దూసుకుపోతుంది. ప్రజల దశాబ్దాల కల నెరవేరడంతో పాటు జిల్లా స్థాయి కార్యాలయాలు వచ్చేశాయి. ఉన్నతాధికారులు చేరువయ్యారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్లో కొన్ని శాశ్వతంగా పరిష్కారమయ్యాయి.

నంద్యాల: నందుల కోట నంద్యాలలో అభివృద్ధి నలువైపులా దూసుకెళ్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పట్టణంలో ఊహించని మార్పులు చోటు చేసుకున్నాయి. ఐదేళ్లలో అభివృద్ధి పరుగులు పెట్టింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలతో పాటు అభివృద్ధి అందింది. నంద్యాలను జిల్లాగా చేయడమే కాకుండా పట్టణంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేశారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, బీటీరోడ్లు అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులను చేసింది. నవ నందుల కోట వాకిట అభివృద్ధి వికసిస్తోంది. గతంలో అధ్వానంగా ఉన్న రహదారులు బాగుపడ్డాయి. శిథిలావస్థలో ఉన్న వంతెనల స్థానంలో కొత్తవి నిర్మితమయ్యాయి. ఉద్యానవనాల్లో పచ్చదనం పరుచుకుంది. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నంద్యాల పట్టణంలో సుమారుగా రూ.279.67 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. 2017 నంద్యాల ఉప ఎన్నికల సమయంలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాలను జిల్లా చేయడమే కాకుండా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా మారుస్తానని నంద్యాల ప్రచార సభలో ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ నంద్యాలను జిల్లా చేసి ఇచ్చిన హామీని నెరవేర్చారు.



నూతన అగ్నిమాపక కేంద్రం



ఆటోనగర్ వద్ద నేషనల్ హైవే బ్రిడ్జి కింద నిర్మించిన పార్కు

ఇది కదా.. అభివృద్ధి

పరిపాలన సులువై.. అభివృద్ధికి నెలవై

నంద్యాల ప్రజల దశాబ్దాల కల నెరవేరి 2022 ఏప్రిల్ 4వ తేదీన నంద్యాల జిల్లాగా ఏర్పాటైంది. దీంతో ప్రజలు కర్నూలు కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. నంద్యాలలోనే కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతో పాటు వివిధ శాఖల జిల్లా కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. దీంతో 70 కిలోమీటర్లు ఉన్న కర్నూలు కేంద్రానికి వెళ్లాల్సిన ఇబ్బందులు ప్రజలకు తప్పాయి. జిల్లా అధికారులందరూ నంద్యాలకు వచ్చారు. దీంతో ఏ సమస్య ఉన్నా ప్రజలు జిల్లా కేంద్రానికి త్వరగా వచ్చి జిల్లా అధికారులతో సమస్యలు తెలుపుకొని పరిష్కరించుకుంటున్నారు. నూనెపల్లెలో 50.93 ఎకరాల్లో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల భవనం నిర్మించారు. గత ఏడాది సెప్టెంబర్ 15వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



కలెక్టర్ కార్యాలయం

వర్చువల్ విధానంలో వైద్య కళాశాలను ప్రారంభించారు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో డిజిటల్ క్లాస్ రూంలతో 150 మెడికల్ సీట్లతో పూర్తిస్థాయి విద్యార్థులతో కళాశాలలో మొదటి సంవత్సరం వైద్యవిద్య తరగతులు జరుగుతున్నాయి.

వైద్య సేవలు మెరుగు..

నంద్యాల సర్వజన ఆసుపత్రికి రూ.7కోట్ల మేర ఖర్చు చేసి అధునాతన హంగులతో తీర్చిదిద్దారు. ఆసుపత్రి ఆవరణంలో నూతనంగా నిర్మించిన ఓపీ భవనం, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, నూతనంగా నిర్మించిన డీఈఐసీ, జీరియాట్రిక్ భవన నిర్మాణాలు పూర్తి చేశారు. ఆసుపత్రి ఆవరణంలో ఆక్సిజన్ ప్లాంట్లు నెలకొల్పి ఆసుపత్రిలో దాదాపు 50 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను ఏర్పాటు చేశారు.

నీటి సమస్యకు చెక్

పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు నీటికోసం ఎన్నో ఇక్కట్లు పడ్డారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందడుగు వేసింది. పట్టణ జనాభా పెరిగినా మరో 30 సంవత్సరాల వరకు నీటి సమస్య ఉండకుండా అమృత్ పథకం కింద జరుగుతున్న పనులు చివరి దశకు చేరుకున్నాయి. వెలుగోడు రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నంద్యాల పట్టణానికి నీటిని తీసుకు వచ్చేందుకు రూ. 157 కోట్లతో చేపట్టిన అమృత్ పనులు చివరి దశకు వచ్చాయి. ఇప్పటికే 90శాతం పనులు పూర్తయ్యాయి.



జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఓపీ భవనం

నంద్యాల వేగంగా అభివృద్ధి చెందుతుంది



నంద్యాల పట్టణం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఐదు సంవత్సరాల్లో చాలా వేగంగా అభివృద్ధి చెందింది. నంద్యాలలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయి. నంద్యాలలో మెడికల్ కళాశాల నిర్మాణం చేయడంతో పాటు రోడ్లు, ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నూతనంగా వేశారు. పట్టణంలో నూతన పార్కులు ఏర్పాటు చేయడంతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, డివైడర్లు వంటివి వేయడంతో కొత్త శోభ సంతరించుకుంది. జిల్లా ప్రభుత్వాసుపత్రి రూపురేఖలే మార్చే విధంగా అభివృద్ధి చేశారు.

– ఎం.రామిరెడ్డి, ఎస్‌బీఓ కాలనీ, నంద్యాల

నంద్యాల ప్రజల కల నెరవేరింది



ఎన్నో ఏళ్ల నంద్యాల వాసుల కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా చేసి నెరవేర్చారు. 70కి.మీ దూరాన ఉన్న కర్నూలులోని కార్యాలయాలకు వెళ్లి రావడం కష్టంగా ఉండేది. నేడు జిల్లా నంద్యాల కావడంతో జిల్లా కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు ఇక్కడే ఉండటంతో కర్నూలుకు వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పాయి. సమస్యలపై కలెక్టర్, ఎస్పీలను కలవాలంటే గతంలో కలవడానికి కష్టంగా ఉండేది. నేడు ఆ పరిస్థితి తొలగిపోయింది

– దూదేకుల కాశీం, కానాల గ్రామం, నంద్యాల

నంద్యాల పట్టణంలో జరిగిన అభివృద్ధి పనులు..

- పట్టణ శివారులో జగనన్న కాలనీ ఏర్పాటు చేసి మొదటి విడతలో 3,006 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించారు.
- నూనెపల్లెలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం కార్యాలయాన్ని రూ.కోటితో నిర్మించారు.
- నూనెపల్లెలో ఆర్‌డబ్ల్యూఎస్ డివిజనల్ కార్యాలయాన్ని రూ.32 లక్షలతో నిర్మించారు.
- నూనెపల్లెలోని గ్రామీణ నీటి సరఫరా మరియు ఇంజనీరింగ్ భవన్‌కు రూ.1.10 కోట్లతో నిర్మాణం.
- క్రాంతినగర్ నుంచి చాపిరేవుల వరకు రూ.2.75 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం.
- నంద్యాల జిల్లా ప్రభుత్వాసుపత్రిలో (అవుట్ పేషెంట్) ఓపీ బ్లాక్ అధునాతన భవనం రూ.5 కోట్లతో నిర్మాణం.
- ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రూ.86లక్షలతో పశు వైద్యశాల నూతన భవన నిర్మాణం.
- నూనెపల్లె నుంచి రైతునగరం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రూ.3కోట్లతో బీటీ రోడ్డు.
- సరస్వతి నగర్ నుంచి హనీఫ్ నగర్ ప్రాంతాల మధ్య ఉన్న చామకాల్వ పైన వంతెన నిర్మాణానికి రూ. 80 లక్షలు వెచ్చించారు. సలీం నగర్ నుంచి హనీఫ్ నగర్ ప్రాంతాల మధ్య ప్రజా ప్రయోజనాల నిమిత్తం రూ.90 లక్షలతో బ్రిడ్జి నిర్మించారు.
- టెక్కెలో ఆర్‌డీటీ, ప్రభుత్వ నిధులు రూ.3.35 కోట్లతో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో 17 కొత్త తరగతి గదుల నిర్మాణం.
- జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ప్రసూతి సమయంలో తల్లీబిడ్డల క్షేమం కోసం రూ.75లక్షలతో ఎమర్జెన్సీ వార్డు అధునాతన పరికరాలతో ఏర్పాటు చేసిన ఐసీయూ.
- టెక్కెలో ఉన్న జిల్లా అగ్నిమాపక కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని కూల్చివేసి రూ.1.20కోట్లతో నూతన అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మించారు.
- పద్మావతినగర్‌లో రూ.40లక్షలతో పబ్లిక్ లైబ్రరీ నిర్మాణం.
- జిల్లా ప్రభుత్వాసుపత్రిలో సీనియర్ సిటిజన్ కోసం రూ.75 లక్షలతో జెరియాట్రిక్ వార్డు నిర్మాణం.
- వైఎస్సార్‌నగర్‌లో రూ.42 లక్షలతో కేజీబీవీ మైనార్టీ పాఠశాల, కాలేజీ నిర్మాణం.
- రైతునగరంలో రూ.55 లక్షలతో వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ నిర్మాణం.
- రాణి మహారాణి థియేటర్ వద్ద ఉన్న కుందూ బ్రిడ్జి నుంచి వైఎస్సార్ నగర్ వరకు రూ.60 లక్షలతో బీటీ రోడ్డు.
- నంద్యాల జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రూ.కోటితో ఆధునీకరించిన ఆరు ఆపరేషన్ థియేటర్లు.
- పట్టణంలో రూ.4.52కోట్లతో నూతన ప్రభుత్వ ఐటీఐ కళాశాల.
- జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రూ.90 లక్షలతో ఆర్‌టీపీసీఆర్ మరియు వైరల్ వీఆర్‌డీఎల్ ల్యాబ్ ఏర్పాటు.
- బొమ్మలసత్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విధంగా స్కిల్ హబ్ కేంద్రం ఏర్పాటు.
- పీవీనగర్‌లో రూ.5.05 కోట్లతో డంపింగ్ యార్డు వద్ద చెత్త రీసైక్లింగ్ మిషనరీ ఏర్పాటు.
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.20 లక్షలతో లేడీస్ వాష్‌రూమ్స్ నిర్మాణం.
- పట్టణ ప్రధాన రహదారిలో రూ.40 లక్షలతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు.
- పట్టణంలో సుమారుగా పలు ప్రాంతాలలో 9 పార్కులను రూ.3.04 కోట్లతో అభివృద్ధి చేశారు.



సలీంనగర్-దేవనగర్‌ను కలుపుతూ నిర్మించిన బ్రిడ్జి



పట్టణంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్

బాబు పగ.. భగభగ

- చంద్రబాబు నిర్వాకంతో పింఛన్‌దారుల అవస్థలు
- మూడు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- పింఛన్ల కోసం వెళ్తూ వడదెబ్బతో జిల్లాలో ఇద్దరు మృతి
- బాబుపై మృతుల కుటుంబీకులు, లబ్ధిదారుల ఆక్రోశం

సాక్షి, నంద్యాల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పింఛన్ గురించి లబ్ధిదారులు ఏనాడు ఆందోళన చెందలేదు. అర్హులై ఉంటే చాలు ఇంటికి పింఛన్ అందజేశారు. అవ్వాతాతలు, దివ్యాంగులు పింఛన్ కోసం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పడిన కష్టాలు, ఇబ్బందులు పడకూడదని వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి తొలి కోడి కూత కూయక మునుపే ఠంఛన్‌గా పింఛన్ ఇచ్చారు. కానీ, వృద్ధుల సంతోషాన్ని చూసి చంద్రబాబుకు కన్నుకుట్టినట్లుంది. చంద్రబాబు కుట్రలతో అవ్వాతాతలు, దివ్యాంగులు మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి తలెత్తింది. తన ముఠాతో ఎన్నికల సంఘానికి లేఖలు రాయించారు. వలంటీర్లు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందజేసేందుకు వీలు లేదంటూ అందులో పేర్కొన్నారు. దీంతో ఎన్నికల సంఘం పింఛన్ పంపిణీలో వలంటీర్లు పాల్గొనవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ నెల పింఛన్ల పంపిణీ 3వ తేదీ నుంచి ప్రారంభం కాగా 4వ తేదీ ఒక్క రోజు పింఛన్ కోసం బయటకు వెళ్లి జిల్లాలో ఇద్దరు వృద్ధులు మృత్యువాత పడ్డారు. నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన సానె తిరుపాలు (74) పింఛన కోసం కుమారుడు బైక్‌పై సచివాలయానికి తీసుకెళ్తుండగా ఉండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరైన వృద్ధుడు మార్గమధ్యంలోనే కన్నుమూశాడు. అలాగే నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని మద్దూరు గ్రామానికి చెంది ముల్లా నూర్జహాన్(54)కు వితంతువు పింఛన్ కోసం కిలో మీటరు దూరంలో ఉన్న సచివాలయానికి నడుచుకుంటూ వెళ్తుండగా ఎండ తీవ్రతకు మధ్యలోనే కుప్పకూలి మృతి చెందింది. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు పైగా నమోదు కావడంతో వడదెబ్బ బారిన పడుతున్నారు. గురువారం చాగలమర్రిలో అత్యధికంగా 44.1, శుక్రవారం రుద్రవరం మండలం ఆలమూరులో 44.41 డిగ్రీల ఉష్ణోగత నమోదైంది. చాలా మంది పింఛన్ కోసం సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరీక్షించి ఎండ వేడిమికి నీరసించిపోయారు.



గడివేముల మండలంలో పింఛన్ల కోసం వేచి ఉన్న వృద్ధులు (ఫైల్)

మూడో రోజు ఇలా..

జిల్లాలో శుక్రవారం కూడా పింఛన్ల పంపిణీ సాగింది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు కార్యాలయాల వద్దకే వెళ్లి పింఛన్ తీసుకున్నారు. జిల్లాలో 2,22,938 మంది లబ్ధిదారుల్లో 2,08,506 మందికి పింఛన్ అందజేశారు. శుక్రవారం సాయంత్రానికి 93.53 శాతం మందికి పింఛన్లను పంపిణీ చేశారు. ఇలాంటి కష్టాలు మళ్లీ తమకు వస్తాయని ఏనాడు ఆలోచించలేదని ఆందోళన చెందుతున్నారు.


పేదోళ్ల ఉసురు తగులుతుంది



మా ఇంటాయన సానె తిరుపాలు పింఛన్‌కోసం వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నారు. ప్రతి నెలా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. మా కుటుంబానికి పింఛన్ సొమ్ము ఎంత ఆసరాగా ఉండేదో మాటల్లో చెప్పలేను. మా ఇంటాయన ప్రాణాలు పోవడానికి కారణం చంద్రబాబే. మాలాంటోళ్ల ఉసురు తప్పకుండా తగులుతుంది.

– రంగ సుబ్బమ్మ, మద్దూరు గ్రామం, పాములపాడు

బాబు వల్లే మా అమ్మ చనిపోయింది



నారా చంద్రబాబు వల్లే మా అమ్మను కోల్పోయాం. మా అమ్మ నూర్జహాన్‌కు వితంతు పింఛన్ వచ్చేది. ఈ ఐదేళ్లు ఇంటి వద్దకే వచ్చి వలంటీర్ పింఛన్ ఇచ్చి వెళ్లేవాడు. చంద్రబాబు ముఠా చేసిన పని వల్లే పింఛన్ కోసం కార్యాలయాల వద్దకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడింది.

– ముల్లా ఉస్సేన్ వలి, పాణ్యం

ఆలమూరు @ 44.41

కర్నూలు(అగ్రికల్చర్): రోజురోజుకు భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. నాలుగైదు రోజులుగా ఎండలు, వడగాలుల తీవ్రత అధికమైంది. రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఎండలు, వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం గమనార్హం. ఉదయం 9 నుంచి ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం ఆలమూరులో 44.41.. మహానంది మండలం బుక్కాపురంలో 44.38, కర్నూలు జిల్లా కోడుమూరు మండలం లద్దగిరిలో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో ఇవే అత్యధిక ఉష్ణోగ్రతలు కావడం ఆందోళన కలిగిస్తోంది. పాణ్యం మండలం అనుపూర్‌లో 44.09, సంజామల మండలం పేరుసోములలో 44.05, కొత్తపల్లిలో 43.85, నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరులో 43.83 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు ఎండలు, వడగాలుల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

గొప్ప సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, దేశ తొలి ఉపప్రధాని, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి ఎన్నో రకాలుగా సేవలు అందించి అందరికీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ కేంద్ర కేబినెట్ మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. షెడ్యూల్ కులాల వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తి స్థాయిలో అందే విధంగా జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయన నడిచిన బాట, చూపిన సంస్కరణలు నేటి తరానికి, యువతరానికి ఆదర్శంగా నిలుస్తాయయన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి దిలీప్ బాషా తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

టీడీపీకి భారీ షాక్

- టీడీపీ నుండి గాండ్ల వంశానికి చెందిన 90 కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీలో చేరిక

నంద్యాల: నంద్యాల నియోజకర్గంలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. పట్టణంలోని టీడీపీకి చెందిన గాండ్ల వంశానికి చెందిన 90 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే శిల్పా స్వగృహంలో శుక్రవారం కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, మాజీ కౌన్సిలర్ నంద్యాల పట్టణ రెండవ క్లస్టర్ అధ్యక్షుడు పున్నాశేషయ్యల సమక్షంలో గాండ్ల కుటుంబాలకు చెందిన గాండ్ల వెంకటరత్నం, గాండ్ల జగన్ మోహన్, మాజీ కౌన్సిలర్ గాండ్ల రాజేశ్వరి, లక్ష్మీదేవి, శ్రీనివాసులు, సుధీర్, రమణారావు, రామన్న, నాగేశ్వరరావు, సుంకరి ఎల్లారెడ్డి, బాలాజీ, రమణ, ఉపేంద్ర, జంబులయ్య, ప్రశాంతితో పాటు 90 కుటుంబాల సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ గాండ్ల రమణ, వారి వంశీకులు, కుటుంబ సభ్యులు ఒకే మాట, ఒకే నాయకత్వంలో ఉంటూ మాట తప్పని వారిగా పేరు ఉందన్నారు. మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి కుటుంబంతో గాండ్ల కుటుంబ సభ్యులకు సన్నిహిత సంబంధం ఉందన్నారు. వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి రావడం ఎంతో శుభపరిణామం అన్నారు. రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రజల కోసం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నారన్నారు. చంద్రబాబు నిర్వాహకం వల్ల వృద్ధులు పింఛన్ కోసం అవస్థలు పడుతున్నారన్నారు. ఐదేళ్లలో మొదటి సారి ఇల్లు దాటి బయటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో నంద్యాలలో ఎమ్మెల్యేగా శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డిని, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు.



మాజీ మంత్రి శిల్పా, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గాండ్ల కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య


మృతిచెందిన దివ్య

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని బైటిపేటకు చెందిన దివ్య (11) తల్లి మందలించిందని మనస్తాపంతో శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అవుట్‌పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు బైటిపేటకు చెందిన సుధారాణి, నరసింహులు దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు. తండ్రి నరసింహులు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పెద్దక కూతురు దివ్య స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఇంట్లో చదువుకోకుండా స్నేహితులతో ఆడుకుంటుండటంతో చదువుకోవాలని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన దివ్య ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొంత సేపటి తర్వాత తల్లి గమనించి స్థానికుల సాయంతో కిందకు దించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఊయలే ఉరితాడై..


మృతిచెందిన మోక్షజ్ఞ

బొమ్మలసత్రం: పట్టణంలోని సాయిబాబానగర్‌కు చెందిన మోక్షజ్ఞ (11) ఊయల ఊగుతూ ప్రమాదవశాత్తు మెడకు చుట్టుకుని ఊయలతాడుకు బలైపోయింది. అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు సాయిబాబానగర్‌కు చెందిన పార్వతి, శ్రీనివాసులు దంపతులు. వీరికి మోక్షజ్ఞ ఒక్కతే కూతురు. స్థానిక ప్రవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. తండ్రి శ్రీనివాసులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి వద్ద ఒక్కతే ఊయల ఊగుతూ ఆడుకుంటుండగా.. ప్రమాదవశాత్తు ఊయల తాడు మెడకు చుట్టుకోవడంతో ఊపిరి ఆడక మృతి చెందింది. ఊయలకు వేలాడుతున్న బాలికను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతిచెందిందని వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నయనం.. నవతేజం


కంటి ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులు


విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసిన దృశ్యం

- విద్యార్థులకు, వృద్ధులకు కంటి పరీక్షలు
- అవసరమైన వారికి కంటి అద్దాల పంపిణీ
- ఉచితంగా కంటి ఆపరేషన్ల నిర్వహణ
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లోనూ కంటి పరీక్షలు
- ఎవరికీ దృష్టి లోపం ఉండకూడదన్న లక్ష్యంతో కార్యక్రమం నిర్వహణ

కర్నూలు(హాస్పిటల్): సరేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు.. చూపు కొద్దిగా మందగించినా జీవనం కష్టమే. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కంటిచూపు పరిరక్షణకు 'వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమాన్ని అమలు చేస్తూ అందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తోంది. చిన్నారుల నుంచి అవ్వాతాతల వరకు వేలాది మందికి కంటి అద్దాలను పంపిణీ చేసింది. ఎంతో మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో లక్షలాది మందికి కంటిచూపును ప్రసాదించింది.

పేదల కుటుంబాల్లో వెలుగులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలు, వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మధ్యలో కొంత కాలం కోవిడ్(కరోనా) రావడంతో లాక్‌డౌన్ కారణంగా 2020 మార్చి నెలాఖరు నుంచి అవ్వాతాతల కంటి వెలుగు పరీక్షలు నిలిచిపోయి అదే యేడాది నవంబర్ 2 నుంచి కోవిడ్ జాగ్రత్తలు పాటిస్తూ పరీక్షలను తిరిగి ప్రాంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ఎంతో మంది పేదల కుటుంబాల్లో వెలుగులు నింపింది. ఒకప్పుడు కంటి జబ్బులున్నా ఆసుపత్రి ఖర్చులకు భయపడి పరీక్షలు చేయించుకోవడానికి కూడా వెళ్లలేని పరిస్థితి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ప్రజల ముంగిటికే వెళ్లి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. చిన్నచిన్న లోపాలున్న వారికి మందులు, దృష్టిలోపాలు ఉన్న వారికి కంటి అద్దాలు, కంట్లో సమస్యలున్న వారికి శస్త్రచికిత్సలు చేయిస్తూ కంటి వెలుగు ప్రసాదిస్తున్నారు. మిగిలిన వారికి కూడా వీలైనంత త్వరగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వృద్ధులు తమకు ఎలాంటి ఖర్చులు లేకుండా ఆపరేషన్లు, కంటి అద్దాలు అందించారంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

6,73,728 మంది పిల్లలకు కంటి పరీక్షలు

చిన్నతనంలోనే ఆరోగ్య సమస్యలు గుర్తించి వారికి వైద్యమందిస్తే పెద్దయ్యాక దుష్ప్రభావాలు కనిపించవనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోంది. జిల్లాలోని 4,351 పాఠశాలల్లో ఉన్న 6,73,728 మంది 5 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 37,329 మందికి దృష్టిలోపం ఉందని నిర్ధారించి 14,525 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 20 మంది చిన్నారులకు కాటరాక్టు ఉన్నట్లు నిర్ధారించి శస్త్రచికిత్స చేశారు. మరో 148 మందికి ఇతర కంటి సమస్యలు ఉండటంతో వారికి అవసరమైన ఆపరేషన్లు చేశారు.

అవ్వాతాతలకు కంటి పరీక్షలు

జిల్లాలో మూడోదశ కంటి వెలుగులో భాగంగా 60 ఏళ్లు పైబడిన అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని 2020 ఫిబ్రవరి 18న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లాలో ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు 2,06,989 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 35,786 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా 47,536 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహించారు. ఆ తర్వాత జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత వైద్యశిబిరాల్లోనూ కంటి పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు 556 వైద్యశిబిరాల్లో 32,655 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఇప్పటి వరకు 19,667 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 9,415 మందికి అవసరమైన మందులు అందజేశారు. 387 మందికి ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేశారు. మరో 3,186 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా ఇప్పటి వరకు 217 వైద్య శిబిరాలు నిర్వహించారు. అందులో 8,080 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 5,417 మందికి కంటి అద్దాలు ఇవ్వాలని నిర్ణయించి ఇప్పటి వరకు 4,381 మందికి పంపిణీ చేశారు. 2,646 మందికి సాధారణ కంటి సమస్యలు ఉన్నట్లు నిర్ధారించి మందులు ఇచ్చి పంపించారు. మరో 16 మందికి కాటరాక్టు ఉందని నిర్ధారించి ఆపరేషన్ చేశారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అర్హులైన వారందరికీ కంటి పరీక్షలు



జిల్లాలో అర్హులైన వారందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. పిల్లలతో పాటు వృద్ధులకు కంటి సమస్యలు లేకుండా చూడటమే ఈ కార్యక్రమం ఉద్దేశం. పిల్లలు, వృద్ధులకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేస్తున్నాం. మరికొందరికి కంటి శుక్లాలు, ఇతర సమస్యలు ఉండటంతో వారికి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. సాధారణ సమస్యలున్న వారికి మందులు ఇచ్చి పంపిస్తున్నాం.

–డాక్టర్ సంధ్యారెడ్డి, జిల్లా అంధత్వ నివారణ అధికారి, కర్నూలు

తీవ్ర జ్వరంతో విద్యార్థిని మృతి


కామవరం సింధు (ఫైల్)

కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలోని శ్రీరామనగర్ కాలనీ నివాసం ఉంటున్న కామవరం సుధీర్, జ్యోతి దంపతుల కుమార్తె సింధు(10) అనే విద్యార్థిని తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..సింధు స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. రెండు రోజులుగా ఆవిద్యార్థిని తీవ్ర జ్వరం రావడంతో స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు అప్రమత్తమై కర్నూలుకు తీసుకెళ్తుండగా శుక్రవారం మృతి చెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమార్తె చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఖనిజ అక్రమ రవాణాపై ఉక్కుపాదం

కర్నూలు(న్యూటౌన్): ఖనిజ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. డోన్ దగ్గర అక్రమంగా నాపరాయి, మొజాయ్ చిప్స్ తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. అలాగే డోన్ దగ్గర పరిమితికి మించి, రాయల్టీ పత్రంలో కనబరచిన దానికంటే అధికలోడ్‌తో నాపరాయి తరలిస్తున్న ఒక లారీని సీజ్ చేశామన్నారు. అక్రమంగా నాపరాయి, మొజాయ్ చిప్స్ తరలిస్తున్న మూడు ట్రాక్టర్లకు ఒక్కో దానికి రూ.10వేలు, అధికలోడ్‌తో నాపరాయి తరలిస్తున్న లారీకి రూ.10వేల చొప్పున అపరాధ రుసుం విధించామన్నారు. అదే విధంగా గురువారం కర్నూలు మండలం గార్గేయపురం దగ్గర అక్రమంగా ఎర్రమట్టిని రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి కర్నూలు అర్బన్ తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఉంచామన్నారు. వాటి నుంచి ఒక్కో టిప్పర్ నుంచి రూ.20వేల చొప్పున రూ.40వేలు అప రాధ రుసుం విధించి మూడు ట్రాక్టర్లు, ఒక లారీతో పాటు రెండు టిప్పర్లకు మొత్తం రూ.80వేలు అపరాధ రుసుం విధించి వసూలు చేసి వాహనాలను విడుదల చేశామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్, రాయల్టీఇన్‌స్పెక్టర్‌లు నవీన్, మురహరి పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్


నిందితున్ని అరెస్ట్ చూపిస్తున్నపోలీసులు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని టెక్కె వీధిలో 2019లో జరిగిన హత్య కేసుకు సంబంధించి రెండవ నిందితుడు గంగు యువరాజ్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సాఆర్ జిల్లాకు చెందిన సోమశేఖర్‌కు నంద్యాల పెద్ద చర్చి డయాసిస్‌కు చెందిన ఎయిడెడ్ పాఠశాలలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేశాడు. ఈ క్రమంలో నవంబర్ 11న టెక్కె వీధిలో ఉంటున్న గంగు ఆనంద్ ఇంటికి వెళ్లి డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగాడు. దీంతో సోమశేఖర్‌ను గంగు ఆనంద్ ఆయన భార్య యోగేశ్వరి కుమారుడు యువరాజ్‌లు కలిసి కత్తితో పొడిచారు. గాయపడిన సోమశేఖర్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక నెల రోజులకు మృతి చెందాడు. ఈ కేసులో టూటౌన్ పోలీసులు గంగు ఆనంద్, భార్య యోగేశ్వరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న యువరాజ్ కోసం ఎయిర్‌పోర్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. మూడు రోజుల క్రితం యువరాజ్ కజకిస్తాన్‌కు పారిపోయేందుకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాడు. అక్కడి ఇమిగ్రేషన అధికారులు యువరాజ్‌పై ఉన్న కేసును గుర్తించి జిల్లా ఎస్పీకి సమాచారమివ్వగా ఆయన టూటౌన్ పోలీసులను ఢిల్లీకి పంపారు. వారు నిందితుడి శుక్రవారం కోర్టులో హాజరుపరచటంతో జడ్జి రిమాండ్‌కు ఆదేశించింది.

డోన్‌లో చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న చర్చి సమీపంలోని బండి సుంకన్న ఇంటిలో చోరీ జరిగింది. తులంన్నర బంగారం, రూ.2లక్షల నగదు, 20 తులాల వెండి ఆభరణాలతో పాటు పక్కింటి బైట పార్కు చేసి ఉంచిన బాషా బైకును అపహరించుకపోయారు. బండి సుంకన్న గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి మిద్దెపై నిద్రించగా ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చోరబడి చోరీచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తిరుగు పెళ్లికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు...

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతిచెందిన కిషోర్ (ఫైల్)


ప్రమాదంలో దెబ్బతిన్న రెండు స్కూటర్లు

ఆస్పరి: తిరుగు పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా రెండు స్కూటర్లు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. కారుమంచి గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ హనుమంతప్ప తెలిపిన వివరాలు మేరకు.. తురువగల్లు గ్రామానికి చెందిన కిషోర్(20), గోవిందు గురువారం రాత్రి తిరుగుపెళ్లికి గోనెగండ్ల మండలం ఆగ్రహారానికి వెళ్లారు. వీరు స్వగ్రామమైన తురువగల్లుకు స్కూటర్‌పై వస్తున్నారు. దేవనకొండ మండలం బెల్లందొడ్డి గ్రామానికి వీరాంజనేయులు, ఈరన్న అనే వ్యక్తులు ఆస్పరిలో తిరుగు పెళ్లి చూసుకుని స్వగ్రామమైన బెల్లందొడ్డికి స్కూటర్‌పై వస్తున్నారు. కారుమంచి గ్రామ సమీపంలో రెండు స్కూటర్లు ఎదురెదురుగా ఢీకొట్టాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తరువగల్లుకు చెందిన కిషోర్, గోవిందు, వీరాంజినేయులు, ఈరన్నను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స కోసం వీరిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కర్నూలులో చికిత్స పొందుతూ కిషోర్ మృతి చెందాడు. గాయపడిన ముగ్గురు వ్యక్తులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్లు ఆస్పరి సీఐ తెలిపారు.

చాలెంజ్ ఓటు అంటే..



పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయంటే తరచూ వినపడే మాట చాలెంజ్ ఓటు. చాలెంజ్ ఓటు అంటే ఏమిటి...దానిని ఎప్పుడు వేస్తారు.. దీనికి ఎలాంటి విధి విధానాలు అనేది తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. చాలెంజ్ ఓటుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు కూడా ఉన్నాయి. ఎవరైనా ఒక ఓటరు బీఎల్‌వోలు ఇచ్చిన స్లిప్ తీసుకొని ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రంలోకి వెళతారు. అప్పుడు పోలింగ్ కేంద్రంలోని రాజకీయ పార్టీల ఎన్నికల ఏజెంట్లు ఆయన ఓటరు కాదని ఓటు వేయడానికి అనుమతించరాదని పేర్కొంటారు. అప్పుడు ఓటరు కూడా తాను నిజమైన ఓటరునని వాదిస్తారు. అప్పుడు ప్రిసైడింగ్ ఆఫీసర్ ఎన్నికల ఏజెంటుతో ఓటరుపై చాలెంజ్ చేస్తావా అంటూ అడుగుతారు. అభ్యంతరం చెప్పిన ఏజెంటు అంగీకరిస్తే సదరు ఏజెంటు ఫీజు కింద రూ.2 చెల్లించాలి. అప్పుడు ఓటరు గురించి అక్కడే ప్రిసైడింగ్ అధికారి విచారణ జరుపుతారు. మీ తల్లి తండ్రి పేర్లు ఏమిటి, మీ ఇంటి నంబరు ఎంత... మీ ఇంటిలో ఉన్న వారి పేర్లు ఏమిటి? ఇంటికి ఇరువైపులా ఎవరెవరు ఉన్నారు...? వారి పేర్లు ఏమిటి తదితర వివరాలు అడుగుతారు. అన్నింటికీ సరిగ్గా జవాబు చెబితే అవి ఓటర్ల జాబితాలోని వివరాలతో సరిపోతే ప్రిసైడింగ్ అధికారి ఈవీఎం ద్వారా ఓటు వేయడానికి అనుమతిస్తారు. ఏజెంటు అభ్యంతరం వీగిపోతుంది. ఈ ప్రక్రియనే చాలెంజ్ ఓటుగా వ్యవహరిస్తారు. ఓటరు తగిన స్లిప్‌లతో ఓటు వేయడానికి వెళ్లినప్పుడు ఏజెంటు అభ్యంతరం చెబితే చాలెంజ్ ఓటుకు అవకాశం ఉంది. అభ్యంతరం చెప్పారు కదా అని వెనక్కివస్తే విలువైన ఓటును నష్టపోవాల్సి వస్తుంది. – కర్నూలు(సెంట్రల్)

కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని, పట్టుబడిన వాహనాన్ని ప్రదర్శిస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు: మారుతి క్యారియర్ వాహనంలో 33 బాక్స్‌ల్లో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. రాయచూరు జిల్లా కడగందొడ్డి గ్రామానికి చెందిన హరీష్ గౌడ్ అనే వ్యక్తి కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని కర్నూలుకు తరలిస్తుండగా శుక్రవారం సెబ్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద 33బాక్స్‌ల్లో తరలిస్తున్న రూ.2లక్షలు విలువైన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యంతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకుని మద్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, విరుపాక్షిరెడ్డి, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

బోధన మెరుగుపడేలా..

- సర్కారు బడుల్లో కొనసాగుతున్న డిజిటల్ విప్లవం
- ప్రతి టీచర్ మొబైల్‌లో స్విఫ్ట్ చాట్ యాప్ ఉండేలా చర్యలు
- ఇప్పటికే ఐఎఫ్‌పీ, బైజూస్ ట్యాబ్‌ల్లో అంతర్భాగం


పాఠశాలలో స్విఫ్ట్‌చాట్ యాప్ ద్వారా సైన్స్ పాఠం బోధిస్తున్న టీచర్ కేవీ సుబ్బారెడ్డి


ట్యాబ్‌లతో విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): సర్కారు బడుల్లో డిజిటల్ విప్లవం కొనసాగుతోంది. పాఠశాల విద్యలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులతో బ్లాక్‌బోర్డు, గ్రీన్ చాక్ బోర్డులపై పాఠాలు చెప్పే దశ నుంచి ప్రతి తరగతి గదిలో డిజిటల్ విధానంలో విద్యా బోధన నిర్వహించే స్థాయిలో ఏపీ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లతో పోటీపడుతున్నాయి. గత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ స్కూళ్లకు పంపిణీ చేసిన స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)లు, కంప్యూటర్ ట్యాబ్‌ల వినియోగంపై జిల్లా స్థాయిలో పలు శిక్షణ కార్యక్రమాలు ఉపాధ్యాయులకు అందించారు. ఈ డిజిటల్ విద్యాబోధన మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు 'స్విఫ్ట్ చాట్‌బాట్' పేరుతో ఓ యాప్‌ను అనుసంధానం చేస్తూ పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఈ యాప్ విద్యాబోధనలో సహాయకారిగా ఉండేలా రూపొందించారు. నంద్యాల జిల్లాలో 3 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి స్మార్ట్‌ఫోన్లలో ఈ స్విఫ్ట్ చాట్‌బాట్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకునేలా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఈ యాప్ ఇన్‌స్టాల్ సమయంలో ఏపీ టీచర్ బోట్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. లాంగ్వేజ్‌ను ఎంపిక చేసుకుని తమ రిజిస్టర్ మొబైల్ నంబర్ ఎంటర్ చేసి, విద్యాశాఖ నుంచి వచ్చిన ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం స్కూల్ యూడైస్ కోడ్, టీచర్ సీఎఫ్ఎంఎస్ ఐడీని నమోదు చేయాల్సి ఉంటుంది. టీచర్ తన వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో ఈ స్విఫ్ట్ చాట్ యాప్‌తో ఎటువంటి ప్రశ్నకైనా సమాధాన్ని రాబట్టుకునేందుకు ఈ నూతన విధానం సులభతరం చేస్తుంది. ఇది అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాంపై పనిచేసే విధంగా ఈ యాప్‌ను రూపొందించారు.

సైన్స్, మ్యాథ్స్ ఉపాధ్యాయులకు శిక్షణ..

ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీపై (ఐటీసీ) ఇటీవల జిల్లా కేంద్రం నంద్యాలలో గణితం సైన్స్ బోధించే ప్రతి టీచర్‌కు ఈ స్విఫ్ట్ యాప్, ఓ ల్యాబ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ అసిస్టెంట్ ఫర్ టీచర్స్, చాట్ జీపీటీ వంటి యాప్స్, వెబ్‌సైట్‌లపై అవగాహన శిక్షణ తరగతులు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. ఈ స్విఫ్ట్ చాట్ యాప్ పాఠశాలలకు సరఫరా చేసిన ఐఎఫ్‌పీలు, 8వ తరగతికి విద్యార్థులకు 17,342 ఉచితంగా అందించిన ట్యాబ్‌లలో ముందుగానే ఇన్‌స్టాల్ చేసి ఉంది.

స్విఫ్ట్ చాట్ ప్రత్యేకతలు ఇవీ..

తెలియని అంశాన్ని వాట్సాప్ చాట్ మాదిరిగా ఈ స్విఫ్ట్ చాట్‌లో ఎస్ఎంఎస్ చేస్తే క్షణంలో దానికి సమాధానం ప్రత్యక్షమవుతుంది. అలాగే ఈ యాప్‌లో 1 నుంచి 10వ తరగతి వారీగా డిజిటల్ తరగతులు, లైవ్ క్విజ్‌లు, కాంపిటీషన్ జోన్, స్కిల్ కార్నర్‌లు, రివార్డులు ఈ యాప్‌లో పొందుపరిచారు. నచ్చిన అంశాన్ని సేవ్ ఐటమ్స్ స్టోర్ చేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఒకటి, రెండు తరగతుల గణితం, మూడు నుంచి పదో తరగతి వరకూ గణితం, సైన్స్ సబ్జెక్టులపై మాత్రమే డిజిటల్ తరగతులు, క్విజ్‌లు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన సబ్జెక్టులపై కూడా భవిష్యత్‌లో డిజిటల్ క్లాసులు పొందుపర్చనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

నూరుశాతం రిజిస్ట్రేషన్ పూర్తి



జిల్లాలో 3వేల మంది టీచర్లకు స్విఫ్ట్ యాప్ ప్రక్రియ పూర్తయింది. ఉన్నత పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులతో 6వ తరగతి పరిసరాల విజ్ఞానం సబ్జెక్టుపై యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. ఉన్నత అధికారులు మినిమం టైమ్ స్కేల్ టీచరు మినహాయింపు ఇచ్చారు.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

గణితంపై క్విజ్‌లు సరదాగా ఉన్నాయి



గణితంపై ఉన్న క్విజ్‌లు, టాస్క్‌లు సరదాగా ఉన్నాయి. జవాబులు, మార్కులు కూడా వెంటనే ప్రత్యక్షమవుతున్నాయి. ఉపాధ్యాయులు వద్ద ట్యాబ్‌లో ఉన్న స్విఫ్ట్ చార్టుతో గణితం, సైన్స్‌పై ఉన్న డిజిటల్ వీడియో చూపుతున్నారు. గ్రూపులుగా ఆలైన్‌లో పూర్తి చేస్తున్నాం.

– జి.లిఖిత, విద్యార్థి, చాపిరేవుల

భవిష్యత్తులో మరింత మెరుగులు దిద్దేలా



స్మార్ట్ ఫోన్ ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో స్విఫ్ట్ చాట్ యాప్ గురించి అవగాహన కల్పించేలా కృషి చేయమని హెచ్ఎంలకు సూచించాం. జిల్లాలో ఇప్పటి 1523 ఐఎఫ్‌బీలు, 851 స్మార్ట్ టీవీలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌ను భవిష్యత్తులో మరింత మెరుగులు దిద్దేలా విద్యాశాఖ చర్యలు తీసుకోనుంది.

– బ్రహ్మంనాయక్, ఎంఈఓ